క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు

నందిగామరూరల్: పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని ఆరవ వార్డులో గురువారం ఆమె పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీధిలైట్లు వెలగటం లేదని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వార్డులో చేపడుతున్న బోరు పంపు మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు యాప్రాన్, టోపీల పంపిణీ

నందిగామటౌన్: వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, కమిషనర్ రమణబాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య సిబ్బందికి యాప్రాన్, టోపీలను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శ్రీవాసవి సేవాసమితి వారి ఆధ్వర్యంలో స్థానిక ముక్త్యాల రోడ్‌లో ఏర్పాటుచేసిన 100 రోజుల చలివేంద్రంలో గురువారం దాతలు మజ్జిగ పంపిణీ చేశారు. పల్నాడు జిల్లా అమరావతికి చెందిన దివంగత వంగేటి లీలావతి జ్ఞాపకార్థం వారి కుమారులు శివప్రసాదరావు బ్రదర్స్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తాడేపల్లి సోమేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి సేవాసమితి ప్రతినిధులు సోమేశ్వరరావు, పేరూరి నరసింహారావు, యన్నాకుల రాంబాబు, పెనుగొండ రామకృష్ణ, రవికుమార్, పార్థసారథి, చవట రమేష్, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల విశ్వసనీయత మెరుగుపరిచేందుకే ఎన్‌క్యూఏఎస్

నందిగామరూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల విశ్వసనీయతను మెరుగుపర్చటమే లక్ష్యంగా జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు (ఎన్‌క్యూఏఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ అసెస్సర్స్ వైద్యులు రాజేష్, చిత్ర మహేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో గురువారం జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లినిక్‌లోని రికార్డులను కేంద్ర బృంద సభ్యులు వర్చ్యువల్‌గా తనిఖీ చేశారన్నారు. ప్రజారోగ్య సౌకర్యాలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులకు నిర్దిష్ట అవసరాల దృష్ట్యా జాతీయ నాణ్యతా హామీ ప్రమాణాలు అభివృద్ధి చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయ్‌కృష్ణ, సీహెచ్‌వో పల్లె వర్షిణి, ఏఎన్‌ఎం నరేంద్ర పాపాయి, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త టిన్‌లు పంపిణీ



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి గ్రామంలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే ప్లాస్టిక్ డబ్బాలను గురువారం మహిళలకు పంపిణీ చేసినట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లపై గాని, బహిరంగ ప్రదేశాలలో ఇళ్లలో వాడిన వ్యర్థ పదార్థాలను, తడి, పొడి చెత్తలను పడవేయరాదని అన్నారు. తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి ఇంటి ముంగిటకు వచ్చే క్లాప్ మిత్ర తీసుకొచ్చే రిక్షాలో వేయాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండు చొప్పున ప్లాస్టిక్ డబ్బాలు పంపిణీ చేశామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, క్లాప్‌మిత్రలు కోట ఆంజనేయులు, బొక్కా తిరుపతిరావు పాల్గొన్నారు.

బీబీఏ ఎన్నికలకు నామినేషన్లు

విజయవాడలీగల్: బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల్లో భాగంగా గురువారం నామినేషన్ల పర్వం సందడిగా కొనసాగింది. ఎన్నికల ప్రధాన అధికారి డి.పి.రామకృష్ణ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష స్థానానికి విష్ణుబొట్ల లక్ష్మీనారాయణ, ఎ.కె.బాషా, బి.డేవిడ్ రత్నకుమార్, తదితరులు పోటీచేస్తున్నారు. ప్రధాన కార్యదర్శిగా రావూరి చునావ్, కె.వి.రంగారావు, బైపూడి నాగేశ్వరరావు తదితరులు పోటీలో ఉండగా, వైస్ ప్రెసిడెంట్‌గా పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పోటీ చేస్తున్నారు.

అమ్మవారి సాక్షిగా అక్రమ కేసులు

- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న ప్రభుత్వం
- నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు, పక్కన గాంధీ, రామారావు తదితరులు

పెనుగంచిప్రోలు: అమ్మవారి సాక్షిగా కూటమి ప్రభుత్వం అమాయకులపై అక్రమ కేసులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతోందని వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులకు నిరసనగా గురువారం స్థానిక టౌన్ సెంటర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ ఈనెల 18న అమ్మవారి చిన్న తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి పుట్టింటి పసుపు-కుంకుమల బండ్ల కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో టీడీపీ వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగిందన్నారు. మొదటగా టీడీపీ వారు రెచ్చగొట్టే పాటలు, డైలాగ్స్ పెట్టటంతో పాటు వాటర్ బాటిల్స్, చెప్పులు విసరటంతో ఘర్షణ జరిగిందన్నారు. ఈ క్రమంలో ఎవరో విసిరిన రాళ్ల పోలీసులకు తగిలి గాయపడటం బాధాకరమన్నారు. రాళ్ల దాడిలో వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావుతో పాటు కార్యకర్తలకు గాయాలయ్యాయన్నారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగితే కేవలం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు 16 మందిని అరెస్ట్ చేసి మచిలీపట్నం కోర్టుకు తీసుకెళ్లటంతో పాటు మరి కొందరిని అరెస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగితే కేవలం అధికార పార్టీ సూచనలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలనే పోలీసులు అరెస్ట్ చేయటం సరైన చర్య కాదన్నారు. ఏదో ఉగ్రవాదులను అరెస్ట్ చేసినట్లు కేవలం 30 సంవత్సరాల లోపు అమాయకులైన విద్యావంతులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న బీసీ, ఎస్సీ, ఓసీ వర్గాల పిల్లలను జైలుకు పంపటం అత్యంత దారుణమన్నారు. రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పోలీసులు సాంకేతిక విజ్ఞానం సాయంతో ఎవరు నిజంగా దాడి చేశారో గుర్తించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలన్నారు. జరిగిన ఘటనను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. అక్రమ కేసులపై పోరాటం చేస్తామన్నారు. ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ మాట్లాడుతూ తమకు రెడ్‌బుక్ రాజ్యాంగం వద్దని అంబేడ్కర్ రాజ్యాంగం అమలు చేయాలన్నారు. తమ పార్టీ వారిపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తున్నారని, కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అధికార పార్టీ నాయకుల మాటలు వినకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత్ విజిత మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. తప్పుడు కేసులు పెట్టి కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట్ల వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, ఎంపీటీసీ సభ్యులు కాకాని స్రవంతి, కీసర లోకేశ్వరరావు, బరిగెల వెంకట్రామయ్య, సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, ఎస్టీసెల్ నాయకులు బద్రునాయక్, రూప్లానాయక్, ఎస్సీసెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, జంగం కాశేశ్వరరావు, బీసీసెల్ నాయకులు మండవ శ్రీనివాస్‌గౌడ్, గుడిమెట్ల శంకర్, తమ్మిశెట్టి సోమయ్య, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు, శ్రీకనకదుర్గమ్మవారి ఆలయ మాజీ డైరెక్టర్ నంబూరి రవి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కనగాల రమేష్, కోనంగి ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఏకపక్ష వైఖరి

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల మహోత్సవాల్లో భాగంగా ఈనెల 18న తెల్లవారు జామున పసుపు-కుంకుమ బండ్ల కార్యక్రమంలో పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. ఈక్రమంలో ఎవరో వేసిన రాళ్లు తగిలి నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. అయితే సంఘటనకు సంబంధించి ఏకపక్షంగా కేవలం వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అరెస్ట్ చేయటంపై ప్రజలు చర్చించుకుంటున్నారు. అసలు ఘర్షణ రెండు వర్గాల మధ్య జరిగితే టీడీపీ వాళ్లు ఒక్కరిని కూడా అరెస్ట్ చేయకుండా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు తప్పు పడుతున్నారు. అసలు ముందు ఎవరు రెచ్చగొట్టారో సమగ్ర పరిశీలన చేయాలని కోరుతున్నారు. అరెస్ట్ చేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అందరూ 30 సంవత్సరాల లోపు వారని, వారికి ఇళ్ల దగ్గర చిన్న పిల్లలు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారని, వారి కుటుంబసభ్యులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. బుధవారం రాత్రి అరెస్ట్ అయిన వారికి కోర్టు రిమాండ్ విధించటంతో మచిలీపట్నం జైల్‌కు తరలించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఏలూరి శివాజీ తదితరులు అరెస్ట్ అయిన వారి తల్లిదండ్రులు, బంధువులకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు.

మూడేళ్ల బాలుడిపై కుక్క దాడి



పేటలో కుక్క కరవడంతో ఓ బాలుడి అరచేతిలో ఒక వైపు నుంచి రెండవ వైపుకు దిగిన పంటి గాయాలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలో వీధి కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తూ పలువురిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నప్పటికీ మున్సిపల్ పాలకవర్గానికి, అధికారులకు చలనం ఉండటం లేదు. ఇటీవల కొన్ని కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామని చెప్పుకుంటున్నప్పటికీ, వాటిని మరలా పట్టణంలోనే వదిలిపెట్టడంతో వాటి సంఖ్యలో ఎటువంటి మార్పు లేకపోగా, వాటి దాడులు ఆగడంలేదు. అనేక ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లే పిల్లల వెంట తల్లిదండ్రులు కర్రలు తీసుకొని వెళ్లాల్సి వస్తోంది. ఉద్యోగాలు చేసే మహిళలు కూడా రక్షణ కోసం ఎవరినైనా వెంటబెట్టుకొని వెళుతున్నారు. అనేక వీధుల్లో బయటకు రావాలంటేనే ప్రజలు వణికిపోతున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది. ఈ క్రమంలో గురువారం స్థానిక ముక్త్యాల రోడ్‌లోని యోగీశ్వరాలయం సమీపంలో దేవాన్ష్ అనే 3 ఏళ్ల బాలుడు ఆరుబయట ఆడుకొంటుండగా ఓ వీధి కుక్క వెంబడించి బాలుడిని కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అరచేతిలో కుక్క పన్ను గుచ్చుకుని అవతల వైపునకు దిగింది. తల్లిదండ్రులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బాలుడికి చికిత్స చేయించారు. తక్షణమే కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించేందుకు పురపాలక సంఘం వారు కఠినచర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలి



సమావేశంలో వీడియోలు చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల, పక్కన నాయకులు

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల సందర్భంగా జరిగిన ఘటనల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులను సస్పెండ్ చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ డిమాండ్ చేశారు. గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ తెల్లవారు జామున అమ్మవారి పసుపు-కుంకుమ కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో మూడు గంటల పాటు వైఎస్సార్ సీపీ ప్రభ బండ్లను ఉద్దేశపూర్వకంగా నిలిపివేశారని, టీడీపీ వారు పోలీసుల సహకారంతో దాడి చేశారన్నారు. ఎగ్జిబిషన్‌లో క్రాస్ జెయింట్ వీల్ తొట్టి ఊడి ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారన్నారు. దీనికి సీఐ, ఎస్‌ఐ బాధ్యత వహించాలన్నారు. పుట్టింటి పసుపు-కుంకుమలు ఆలయంలోకి తెస్తున్న క్రమంలో ఎక్కువ భాగం కింద పడిపోయిందని దీనికి పోలీస్ శాఖ బాధ్యత వహించాలన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నిరుపేద వర్గాలకు చెందిన యువకులను కొందరు నాయకుల సహకారంతో అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. జైలుకు వెళ్లిన వారు అందరూ అమాయకులని, కేవలం రాజకీయ కక్షతోనే ఇలా చేశారన్నారు. వీటన్నిటిపై తమ దగ్గర వీడియో ఆధారాలు ఉన్నాయన్నారు. జాతీయ ఎస్సీ, బీసీ కమిషన్, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు పోలీసులపై ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాడిశ పాపారావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, నాయకులు శ్రీనివాసరావు, బత్తుల వెంకటనర్సు, ఓర్సు కొండలు, షేక్ మదార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పన్నులు

నూరు శాతం వసూలయ్యేనా?

- ముంచుకొస్తున్న గడువు.. వసూళ్లలో సిబ్బంది..
- గతేడాది బకాయిలు రూ.లక్షల్లోనే..



ముక్త్యాల గ్రామ పంచాయతీ కార్యాలయం

జగ్గయ్యపేట: 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పంచాయతీ పన్నుల వసూళ్లు నూరు శాతం వసూళ్లపై సిబ్బంది నిమగ్నమయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలల్లో 59 గ్రామ పంచాయతీలున్నాయి. అన్ని గ్రామ పంచాయతీలలో పలు రకాల పన్నులు కలిపి రూ.3.47 కోట్లు బకాయిలున్నాయి. అయితే పంచాయతీ సిబ్బంది ఫిబ్రవరి నుంచే పన్నుల వసూళ్ల ప్రక్రియ ప్రారంభించారు. రెండు నెలలుగా గ్రామాల్లో పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు రూ. కోటి మాత్రమే వసూలయ్యాయి. కేవలం 28 శాతం మాత్రమే పూర్తి చేయగా ఇంకా 72 శాతం పూర్తి చేయాల్సి ఉంది. దీంతో కార్యదర్శులు వసూళ్లలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. పన్నులు వసూలు చేయకుంటే జిల్లా అధికారులు చార్జి మెమోలు ఇస్తామని చెబుతున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా రూ.3.47 కోట్ల బకాయిలు..

జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలలో రూ.3,47,91,824 బకాయిలు ప్రజలు చెల్లించాల్సి ఉంది. జగ్గయ్యపేట రూ.1,02,46,824, పెనుగంచిప్రోలు రూ.1,28,85,000, వత్సవాయి మండలంలో రూ.1,16,60,000 బకాయిలున్నాయి. ఇందులో జగ్గయ్యపేట మండలంలోని బూదవాడ, ముక్త్యాల, ధర్మవరప్పాడు తండా గ్రామాల్లో సిమెంట్, కెమికల్ కర్మాగారాలు రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉండగా యాజమాన్యాలు ముందస్తుగా చెల్లించటం విశేషం. జగ్గయ్యపేట మండలంలో షేర్‌మహ్మద్‌పేట, చిల్లకల్లు, తిరుమలగిరి గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు జరగని నేపథ్యంలో ప్రత్యేకాధికారులున్నప్పటికీ పన్నుల వసూళ్లపై దృష్టి సారించటం లేదు.

సర్వేల పేరుతో విధులకు ఆటంకం..

ప్రభుత్వం రోజుకొక కార్యక్రమం పేరుతో, ఆరు రకాల సర్వేల పేరుతో విధులకు ఆటంకం కలిగిస్తుండటంతో ఆ పనులు పక్కన బెట్టి మరొక పనులు అప్పగిస్తుండటంతో పన్నుల వసూళ్లకు తీవ్ర అంతరాయం కలుగుతోందని కార్యదర్శులు చెబుతున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా మక్కపేట, పోచవరం, సింగవరం, దేచుపాలెం, చిట్యాల, కన్నెవీడు, వేములనర్వ, పెద్దమోదుగపల్లి, కంభంపాడు, శనగపాడు, కొల్లికుళ్ల, అన్నవరం, రామచంద్రునిపేట, అనుమంచిపల్లి, బండిపాలెం గ్రామ పంచాయతీలు 70 శాతం మేర పన్నులు వసూలు చేశాయి. మిగిలిన పంచాయతీలలో కూడా వసూళ్లు వేగవంతమైతే గ్రామాభివృద్ధికి ఆటంకం ఉండదని అధికారులు అంటున్నారు. ఇదిలా ఉంటే పన్నుల వసూళ్లకు వెళ్తే పలు గ్రామాల్లో తాగునీరు సక్రమంగా రావటం లేదని, పలు కాలనీలలో బోర్లు పని చేయటం లేదని, వీధి లైట్లు వెలగటం లేదని చెబుతూ తాము పన్నులు చెల్లించేది లేదంటూ సిబ్బందితో అంటున్నారు.

నూరు శాతం వసూలు చేయకుంటే చర్యలు

నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పన్నుల బకాయిలను ఈ నెలాఖరు నాటికి వసూలు చేయాలి. ఇప్పటికే కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కూడా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఆదేశాలిచ్చాం. ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న బకాయిలను వసూలు చేయాలి. వసూలు చేయని కార్యదర్శులపై చర్యలు తప్పవు.

– రాఘవన్,
డీఎల్పీవో, విజయవాడ

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

కంచికచర్ల: శిబిరాలు నిర్వహించి కోడి పందేలు, పేకాట ఆడినా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజు హెచ్చరించారు. మండలంలోని పెండ్యాలలో గురువారం రాత్రి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.12,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న పేకాటరాయుళ్లను శుక్రవారం నందిగామ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రులలో కాన్పులు శ్రేయస్కరం




వీరులపాడు: ప్రభుత్వాస్పత్రులలో కాన్పులు శ్రేయస్కరమని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సుఖ ప్రసవాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవటం, పౌష్టికాహారంపై అవగాహన కలిగించాలని సూచించారు. ముఖ్యంగా ఆస్పత్రులకు వచ్చే రోగుల పట్ల వైద్యారోగ్య సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని తెలిపారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సర్పంచ్ కన్నమాల సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు మందూరి ప్రకాశరావు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

23 న మెగా ఉచిత వైద్య శిబిరం



జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 23 వ తేదీన శ్రీవాసవి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కోరారు. ఈ సందర్భంగా గురువారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో వైద్యశిబిరానికి చెందిన పోస్టర్లను ఎమ్మెల్యే తాతయ్య ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడకు చెందిన పెద్దేశ్వర్ హెల్త్ కేర్ వారి సహకారంతో స్థానిక జేఆర్‌సీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీవాసవీ సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

చలో పార్లమెంట్ కరపత్రాల ఆవిష్కరణ



నందిగామటౌన్: ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయటంతో పాటు ఇష్టారీతిన జరిమానాలను పెంచుతూ తీసుకువచ్చిన జీవో నంబరు 21ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ నెల 24న చేపడుతున్న చలో పార్లమెంట్ కరపత్రాన్ని కార్మికులతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ చట్టం నిబంధనల మేరకు పని గంటలు, వారాంతపు విశ్రాంతి తదితరాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. కార్మికులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న చలో పార్లమెంట్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటోస్టాండ్ యూనియన్ నాయకులు బాబు, పుల్లయ్య, నాగరాజు, జానీ, కిషోర్, రవి, గోపి, విలిసేరావు, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మద్దులమ్మ గుడి రోడ్డులో గండ్లు పూడ్చివేత



మద్దులమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డుపై గండ్లు పూడ్చివేస్తున్న గ్రామస్తులు

గొట్టుముక్కల(కంచికచర్ల): మండలంలోని గొట్టుముక్కల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువై ఉన్న శ్రీమద్దులమ్మ తల్లి దేవాలయానికి వెళ్లే రోడ్డుకు గ్రామానికి చెందిన నాయకులు గురువారం అభివృద్ధి పనులు పూర్తిచేశారు. గత నాలుగు రోజుల నుంచి గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు రోడ్డుపై పడిన గండ్లను సొంత నిధులతో పూడ్చివేశారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై గండ్లు ఏర్పడటంతో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ ఆర్థిక సహకారంతో కొంతమేర సిమెంట్‌రోడ్డు నిర్మాణం చేశారు. మండలంలోని గొట్టుముక్కల, పరిటాల, వీరులపాడు మండలం నరసింహారావు పాలెం గ్రామస్తులు రూ.25 లక్షల విరాళాలు సేకరించి కొంతమేర సిమెంట్ రోడ్డు నిర్మించారు. రోడ్డు దిగువ ప్రాంతంలో కొంతమేర గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఆ గ్రావెల్ రోడ్డు వరదనీటితో పాటు కొంత ప్రాంతం నుంచి వచ్చిన నీటికి పూర్తిగా కొట్టుకుపోయి గండ్లు ఏర్పడ్డాయి. గ్రామానికి చెందిన గుదే వెంకటేశ్వరరావు(బుజ్జి) స్పందించి సొంత నిధులు వెచ్చించి జేసీబీతో గండ్లు పడిన రోడ్డుకు అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే మద్దులమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతి గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, గూడ్స్ ఆటోలు, అప్పే ఆటోల ద్వారా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. గండ్లు పడిన రోడ్డుకు అభివృద్ధి పనులు చేస్తున్న గ్రామస్తులను పలువురు భక్తులు అభినందించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



సుందరరావు



ఆంజనేయులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. బార్ అసోసియేషన్ 2025-26వ సంవత్సరానికి గాను ఈనెల 27 వ తేదీన ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి అన్నెపాగ సుందరరావు, ప్రధాన కార్యదర్శి పదవికి మెట్టెల ఆంజనేయులు, ఉపాధ్యక్ష పదవికి డి.నాగేశ్వరరావు, మహిళా కార్యదర్శిగా ఎం.ప్రతిభ నామినేషన్ దాఖలు చేశారు. పై పదవులకు మరెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఆయా పదవులకు వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా అన్నెపాగ సుందరరావు, ప్రధాన కార్యదర్శిగా మెట్టెల ఆంజనేయులు ఎన్నిక ఏకగ్రీవం అయింది. ఈ విషయాన్ని గురువారం ఎలక్షన్ ఆఫీసర్ అభ్యర్థులకు డిక్లరేషన్ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ ఆఫీసర్‌గా సీనియర్ న్యాయవాది కొల్లి మార్షల్ స్టాలిన్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా కె.శ్రీనివాసరావు ఎన్నికల ప్రకియను విజయవంతం చేశారు. ఎన్నికల ప్రక్రియలో గెలిచిన అధ్యక్ష, కార్యదర్శులకు బార్ సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఈవీ జగన్నాధరావు, బి.వెంకట్రామయ్య, కాసరగడ్డ నాగేశ్వరరావు, జి.లక్ష్మీనారాయణ, టీఎల్ నరసింహారావు, పూసల నాగరాజు, రావూరి లక్ష్మీనారాయణ, శ్యామల, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సురభి నాటకోత్సవాలు

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం తంజావూరు ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాల్లో నిర్వహిస్తున్న సురభి పద్యనాటకోత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు కార్యక్రమంలో సురభి ఆర్ట్స్ అసోసియేషన్, సురభినాట్య కళామండలి ఆధ్వర్యంలో మాయాబజార్ నాటికను ప్రదర్శించారు. నాటకంలో నిర్వాహకులు ప్రదర్శించిన అంశాలు సురభినాటక వైభవాన్ని చాటాయి. ముఖ్యంగా ఘటోత్కజుడి ప్రవేశం, అభిమన్యుడు, ఘటోత్కజుడి యుద్ధం, మాయా శశిరేఖ వివాహం తదితర అంశాలు ఆకట్టుకున్నాయి.

నాటకంతోనే కళాకారుల జీవన ప్రయాణం

నాటకంతోనే సురభి కళాకారుల జీవన ప్రయాణం సాగుతుందని, సాంకేతికంగా వస్తున్న మార్పులను వారు ప్రదర్శనలో ఏర్పాటు చేస్తారని కూచిపూడి నాట్యాచారిణి స్వర్ణలత అన్నారు. ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో కుటుంబ సభ్యులందరూ నాటకం కోసమే జీవించడం అరుదైన సంఘటనగా అభివర్ణించారు.